క్లుప్తంగా

ఫొటోలు సమాజాన్ని మేల్కొలుపుతాయి



సాక్షి ఫొటో జర్నలిస్టులకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రకాశ్, క్లబ్ సభ్యులు

నయీంనగర్ : సామాజిక దృక్పథం ఉన్న ఫొటోలు సమాజాన్ని మేల్కొలుపుతాయని శాసన మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. గురువారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటో కాంటెస్ట్ విజేతలకు బహుమతి ప్రదానంలో ప్రకాశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉత్తమ వార్త చిత్రం విభాగంలో జీవన వైవిధ్యం క్యాప్షన్ ఫొటోకు సాక్షి దినపత్రిక వరంగల్ స్టాఫ్ ఫొటో గ్రాఫర్ పెద్దపల్లి వరప్రసాద్‌కు ప్రథమ బహుమతి కింద రూ.10 వేలు, జనగామ సాక్షి ఫొటో గ్రాఫర్ గోవర్ధనం వేణుగోపాల్‌కు కన్సోలేషన్ బహుమతి కింద రూ.2 వేల చెక్కు, మెమోంటో, ప్రశంసపత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు గాడిపెల్లి మధు, గడ్డం కేశవమూర్తి, వేణుమాధవ్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

'అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి'



చిల్పూరు: ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతి పక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను సోషల్ మీడియా వారియర్స్ తిప్పికొట్టాలని చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. పల్లగుట్ట గ్రామంలో గురువారం సోషల్ మీడియా మండల కో ఆర్డినేటర్ ఊరడి రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజేష్‌నాయక్, బాలరాజు, సురేష్, యువరాజ్, రాజు పాల్గొన్నారు.

నియామకం




సృజన్‌కుమార్ నవీన్‌రెడ్డి

దేవరుప్పుల: బీజేపీ జిల్లా నూతన కార్యవర్గంలో మండలం నుంచి ఇద్దరిని కీలక పదవులు వరించాయి. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చింత సృజన్‌కుమార్ (కామారెడ్డిగూడెం), జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాగాల నవీన్‌రెడ్డి (అప్పిరెడ్డిపల్లె) నియామకం అయ్యారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతం కోసం పాటుపడుతున్న తరుణంలో జిల్లాలో కీలక పదవులు ఇవ్వడంతో జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్, మాజీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రాంమోహన్‌రెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డి, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మీడియా కన్వీనర్‌గా రమేశ్



చిల్పూరు: బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్‌గా వంగాలపల్లి గ్రామానికి చెందిన కాదుగాయ రమేశ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మీడియా కన్వీనర్‌గా నియమించినందున సంతోషంగా ఉందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన పార్టీ జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కార్యదర్శులుగా సతీష్, సంపత్



సతీశ్



సంపత్

లింగాలఘణపురం/ పాలకుర్తిటౌన్: లింగాలఘణపురం మండలం మాణిక్యాపురం గ్రామానికి చెందిన చౌదరిపల్లి సతీశ్, పాలకుర్తికి చెందిన దుంపల సంపత్‌లు బీజేపీ జిల్లా కార్యదర్శులుగా నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు చౌడ రమేశ్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

డైరీల పంపిణీ

పాలకుర్తి: మండలంలోని దర్దేపల్లి జెడ్పీ హైస్కూలు, ఎంపీపీఎస్ విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో డైరీలను పంపిణీ చేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం సూర్యప్రకాశ్, ట్రస్టు చైర్మన్ యతిపతి శ్రీకాంత్‌లు మాట్లాడుతూ విద్యార్థులకు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి ఒర్రె కుమారస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న తహసీల్ పైకప్పు

● పట్టించుకోని అధికారులు



పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయ పైకప్పు

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గ కేంద్రం, రెవెన్యూ డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయం పైకప్పు పెచ్చులు ఊడుతూ ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల క్రితం నిర్మించిన కార్యాలయం కావడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో కార్యాలయ గోడలు బీటలు వారడంతో పాటు పలు గదులలో పైకప్పు పెచ్చులూడుతున్నాయి. భారీ వర్షం వచ్చినప్పుడు కార్యాలయం పైకప్పు కురుస్తుంది. దాంతో ప్రస్తుత వర్షాకాలంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కార్యాలయ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారు. అనునిత్యం రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ పరమైన పనులతో వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో రద్దీగా ఉండే తహసీల్దార్ కార్యాలయంలో శిథిలావస్థకు చేరినా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కనీసం తాత్కాలిక మరమ్మత్తులు పనులైనా చేయించాలని పలువురు కోరుతున్నారు.

నానో యూరియాను వినియోగించాలి

● మండల వ్యవసాయ అధికారి దివ్య



దేవరుప్పుల: కోలుకొండలో ఎరువుల స్టాకును పరిశీలించిన ఏఓ దివ్య

దేవరుప్పుల: ఘనపదార్థం బదులు నానో యూరియాను రైతులు వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి బజ్జూరి దివ్య సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియా స్టాకు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా లిక్విడ్ రూపం(నానో)లో ఎకరానికి 1 లీటరు 2 సార్లు స్ప్రే చేస్తే ఒక బస్తా యూరియా వేసిన దానితో సమానమన్నారు. ఇలాంటి నానో యూరియా అన్ని షాపుల్లో అందుబాటులో ఉందన్నారు. దేవరుప్పుల మండలంలో ఖరీఫ్ సీజన్ సాగులో 25 వేల ఎకరాల్లో పంటల సాగుకుగానూ 2600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరానికి ఇప్పటికే 1780 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేయగా ఎరువుల దుకాణాల్లో 62.64 టన్నుల యూరియా(బస్తాలు) నిల్వ ఉందన్నారు. శుక్రవారం(నేడు) దేవరుప్పుల, కోలుకొండ డీలర్ దుకాణాలకు ఆ ప్రాంతాల్లో పంటల సాగుకు అనుగుణంగా యూరియా దిగుమతి కానునట్టు పేర్కొన్నారు. నిర్దేశిత పంటలకు అనుగుణంగా యూరియా సరఫరా అవుతున్నందున రైతులు ఆందోళన చెంది దుకాణాల వద్ద బారులుదీరి సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. ఏఈఓలు ఎ.సంతోష్, షానా మహవీణ్ ఉన్నారు.

బచ్చన్నపేట: రైతులు నానో యూరియాను వినియోగిస్తే అధిక పంట దిగుబడులు వస్తున్నాయని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సొసైటీలో 167 బస్తాల యూరియా పంపిణీ చేయడం జరిగిందన్నారు. నానో యూరియాను పంటలపై పిచికారీ చేస్తే మంచి ఫలితం వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఈఓ కాశ బాలస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలతో జాగ్రత్త



పొలంబాటలో విద్యుత్ అధికారులు

లింగాలఘణపురం: రైతులు వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ శంకరయ్య కోరారు. గురువారం నెల్లుట్లలో విద్యుత్ అధికారులు రైతు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇనుప స్టార్టర్లు వాడవద్దని, ప్లాస్టిక్ డబ్బాలు ఉపయోగించాలని, ఐఎస్ఐ నాణ్యత గల కేబుల్‌వైర్ వాడాలని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు పోతే అధికారులకు తెలియజేయాలని, రైతులే స్వయంగా వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో లైన్‌మెన్ ర జనీకాంత్, ఏఎల్ఎం విజయ్‌కుమార్, కట్టర్ చంద్రమోహన్, రైతులు పాల్గొన్నారు.

పెసర పంట పరిశీలన



పాలకుర్తి: అధిక లాభాలు వస్తాయని విస్నూరులో రైతులు వేసిన పెసర పంట పూర్తిగా నష్టపోయారు. కాగా, గురువారం రైతులు నష్టపోయిన పంటలను వ్యవసాయాధికారులు ఏఓ శరత్ చంద్ర, ఏఈఓ వెంకటేశ్ పరిశీలించారు. రైతు చలపతిరావు ఆరు ఎకరాల్లో వేసిన పంటను తీసే సమయంలో వర్షాలకు పూర్తిగా నష్ట పోయానని అధికారులకు తెలిపారు. సుమారు రూ.1.80 లక్షలు నష్టపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిసర గ్రామాలైన మైలారం, దుబ్బతండాకు చెందిన మోతిరాం, లచ్చిరాం, బాస్కర్, బికోజీలు కూడా పంటలు పూర్తిగా నష్టపోయామని అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు నష్టపోయిన పంటల పూర్తి వివరాలతో నివేదికను అధికారులకు అందజేస్తామని తెలిపారు.

ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొడకండ్ల: పోషణ్ ట్రాకర్ యాప్‌లో ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మండలకేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ రిపోర్టింగ్ డిజిటలైజేషన్ సిస్టంకు అమలుకు ముందు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కంప్యూటర్, ల్యాప్‌టాప్, ట్యాబ్, 5జీ నెట్‌వర్క్‌తో కూడిన ఫోన్లు, ఉచిత వైఫై కనెక్షన్ ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మైమూదాభేగం, ఉప్పల సరిత, ఉప్పలక్ష్మీ, మంజు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించాలి

బచ్చన్నపేట: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూసమస్యలను పరిష్కరించి రైతులకు భరోసా కల్పించాలని ఆర్డీఓ గోపీరామ్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలు భూ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామానుజాచారి, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎంఆర్ఐలు వంశీకృష్ణ, మున్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ భారతి దరఖాస్తులపై సమీక్ష సమావేశాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ భారతి దరఖాస్తులతో పాటు కల్యాణలక్ష్మి, ఎన్ఎఫ్‌బీఎస్, మీసేవ తదితర సర్టిఫికెట్లపై సమీక్షించారు. తహసీల్దార్ రాజేష్‌రెడ్డి, ఆర్ఐ బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా బలపడాలి



ఫెడరేషన్ ప్రారంభోత్సవంలో సుజాత

బచ్చన్నపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులు రాజకీయంగా బలపడాలని వచ్చే స్థానిక సంస్థల్లో బలంగా పోటీ చేయాలని తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఆర్యవైశ్య వాసవి నూతన భవనాన్ని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. జిల్లా అధ్యక్షుడు గంగిషెట్టి ప్రమోద్‌కుమార్, జిల్లా యూత్ అధ్యక్షుడు జిల్లా సందీప్, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, మండల అధ్యక్షుడు కొత్తపల్లి రాజయ్య, పట్టణ అధ్యక్షుడు జిల్లా రాజేశ్వర్, గౌరవ అధ్యక్షుడు ఉపేందర్ పాల్గొన్నారు.

'మార్వాడీలతో కులవృత్తులు నిర్వీర్యం'



మాట్లాడుతున్న రామేశ్వరాచారి

జనగామ రూరల్: మార్వాడీలతో కుల వృత్తులు నిర్వీర్యమవుతున్నాయని రాష్ట్ర స్వర్ణకార సంఘం ముఖ్య సలహాదారుడు నారోజు రామేశ్వరా చారి అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా స్వర్ణకార సంఘం కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు వల్లభ చక్రపాణి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామేశ్వరా చారి మాట్లాడుతూ చేతివృత్తులను నమ్ముకుని జీవిస్తున్న స్వర్ణకారులకు పాన్ బ్రోకర్ మార్వాడీ షాప్‌ల వల్ల పూర్తిగా పని లేకుండా పోయి కుటుంబ పోషణ కష్టమవుతుందన్నారు. కనీసం షాపు కిరాయి కట్టలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. అందుకే మార్వాడీ గో బ్యాక్ అని అంటున్నామని అన్నారు. ప్రధాన కార్యదర్శి సారాబోజు ఆంజనేయులు, కోశాధికారి శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కందుకూరి సంతోష్ కుమార్, సహాయ కార్యదర్శి పోతకనూరి కనకాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చెన్నోజు నగేష్ కుమార్, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నోజు ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో గోస పడుతున్న రైతులు

● మాజీ మంత్రి దయాకర్‌రావు



పార్టీలో చేరిన వారితో దయాకర్‌రావు

కొడకండ్ల: వినూత్న పథకాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తే మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హయాంలో రైతులు అరిగోస పడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా రామోజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు.

పలువురు బీఆర్ఎస్‌లో చేరిక

కొడకండ్ల మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మీ అమరేందర్ రెడ్డి, దేవస్థాన మాజీ డైరెక్టర్ కుమార్‌గౌడ్, రేగుల మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డిలతో పాటు కొడకండ్ల, రేగుల, ఏడునూతుల, చెరువుముందుతండా, నర్సింగాపురం, పెద్దబాయితండాలకు చెందిన పలువురు దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మండల ఇన్‌చార్జ్ బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, పేరం రాము,వెంకటేశ్వర్‌రావు, గాంధీ, సోమరాములు పాల్గొన్నారు.

మహిళా భవనం మంజూరు చేయండి



రఘునాథపల్లి: మండలంలోని కోడూర్ మహిళా సంఘాలకు మహిళా సంఘం భవనం మంజూరు చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి విజ్ఞప్తి చేశారు. మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ప్రగతి గ్రామైఖ్య సంఘం మహిళా నాయకులు గురువారం హనుమకొండలో ఎమ్మెల్యేను కలిసి భవనం కోసం విన్నవించారు. సంఘాల సమావేశాలకు భవనం లేక ఇబ్బందులు తీవ్ర పడుతున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. మహిళా సంఘం భవనానికి వెంటనే రూ.10 లక్షలు మంజూరు చేస్తానని, 15 రోజుల్లో పనులు చేపట్టాలని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. మాజీ సర్పంచ్ జోగు గట్టయ్య, గౌరిగ భాస్కర్, అంజయ్య, మదన్‌మోహన్, చంద్రయ్య, శ్రీలత ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 23వ తేదీన ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్‌కుమార్ కోరారు. ఈ మేరకు మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను డివిజన్‌కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఆయన ఆవిష్కరించారు.

పాలకుర్తి: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 23వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు కావస్తున్నా ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు.

ఇష్టపడి చదివితే లక్ష్యసాధన అనివార్యం

దేవరుప్పుల: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు ఇష్టపడి చదివే అలవాటు పడితే ఆశించిన లక్ష్యసాధన అనివార్యమని రిటైర్డ్ ఉపాధ్యాయుడు పోకల రవీందర్ సూచించారు. గురువారం సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన 55 మంది విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేసి మాట్లాడారు.

ఆర్థికసాయం

పాలకుర్తి: గూడూరు శివారు జానకిపురానికి చెందిన గుండె జివ్వయ్య గుండె పోటుతో మృతి చెందింది. కాగా, గురువారం బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సాయం అందజేశారు.

స్థల పరిశీలన

పాలకుర్తి టౌన్: మల్లంపల్లి శివారు బీక్యానాయక్ పెద్దతండాలో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి గురువారం డీఈఈ ఆపరేషన్ వై.రాంబాబు స్థల పరిశీలన చేశారు. అయన వెంట ఏఈలు రణధీర్‌రావు, రాకేష్, కంట్రాక్టర్ ఉన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

రఘునాథపల్లి: గుంతలమయమైన మండల కేంద్రంలోని కంచనపల్లి రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పాడైన కంచనపల్లి రోడ్డు వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు.

పాలకుర్తిలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండలంలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాలకుర్తికి విద్యా రంగంలో అన్యాయం జరిగిందని, గత ప్రభుత్వాలు ఈ ప్రాంతంలో విద్యా సంస్థలు ఏర్పాటు చేయకుండా పక్క మండలాలకు తరలించాయని విమర్శించారు. విద్యా పరంగా వెనుకబడిన పాలకుర్తి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఇంటిగ్రేడ్ స్కూల్‌ను పాలకుర్తిలోనే ఏర్పటు చేయాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జనగామ: పట్టణంలోని శ్రీ సాయి రెసిడెన్సి కాలనీలో పేకాట ఆడుతున్న ఐదుగురు ప్రముఖులను పట్టుకున్నట్లు ఎస్సై రాజేశ్ గురువారం తెలిపారు. పేకాట ఆడుతున్న పక్కా సమాచారం మేరకు ఈ నెల 20వ తేదీ రాత్రి దాడులు చేయగా, రెడ్ హ్యాండెడ్‌గా దొరికారన్నారు. వారి నుంచి రూ.7,780 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జనగామ రూరల్: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి 43 తులాల వెండి, ఐదు గ్రాముల బంగారం చోరీకి పాల్పడిన ఘటన గురువారం వడ్లకొండ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన బొల్లం ప్రమీల ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. బుధవారం అదే గ్రామంలోని మేనమామ ఇంటికి వెళ్లింది. తిరిగి గురువారం తెల్లవారు జామున ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తెరిచి, బీరువా పగులగొట్టి ఉంది. బీరువాలోని 43 తులాల వెండి, ఐదు గ్రాముల బంగారం దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్ ఘటనా స్థలానికి చేరుకుని క్లూజ్ టీం, ఫింగర్ ప్రింట్స్ బృందం ఆధ్వర్యంలో దొంగల ఆనవాళ్లను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

శాంతియుతంగా నవరాత్రులు నిర్వహించుకోవాలి

దేవరుప్పుల/బచ్చన్నపేట: శాంతియుత వాతావరణంలో, నిబంధనల మేరకు గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఎస్సైలు ఊర సృజన్‌కుమార్, ఎస్కే అబ్దుల్ హమీద్ సూచించారు. గురువారం వారు ఆయా పోలీస్‌స్టేషన్లలో విలేకరులతో మాట్లాడారు. ప్రతీ మండపం వద్ద పూర్తి బాధ్యత వహించే నిర్వాహకులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకుని అనుమతి పొంది విధిగా సీసీ కెమెరా ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా విద్యుత్ వాడకంపై సంబంధిత శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

ఘనంగా బోనాలు



దేవరుప్పుల: శ్రావణమాసం పురస్కరించుకొని మండల కేంద్రంలో గురువారం మహిళలు కుల దేవతలతో పాటు ముత్యాలమ్మ తల్లికి అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాలు చేశారు. ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● మాజీ ఎమ్మెల్యే రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు చేసిన హామీలులో పూర్తిగా విఫలమై రాక్షస పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఇప్పగూడెంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊరూరికి బీఆర్ఎస్ సంక్షేమాలు-ఇంటింటికీ కేసీఆర్ పథకాలు కార్యక్రమంలో భాగంగా సముద్రాల, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపెల్లిగూడెం, ఇప్పగూడెం గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల్లో రాజయ్య పాల్గొని పార్టీ శ్రేణులకు రానున్న స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఇప్పగూడెంలో మాట్లాడుతూ రైతులు యూరియా కోసం క్యూలలో నిల్చొని అరిగోస పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం, పాలకులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కడియం శ్రీహరి కబడ్దార్ ఉప ఎన్నికలు అనివార్యమని, రానున్న రోజుల్లో ప్రజలు కర్రుకాల్చి తమ ఓట్ల ద్వారా వాత పెడతారని ఆయన హెచ్చరించారు. నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేయాలి

జఫర్‌గఢ్: గ్రామ స్థాయిలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కలసికట్టుగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పేర్కొన్నారు. ఓబులాపూర్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ గబ్బెట దేవదాసుతో పాటు పలువురు కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే రాజయ్య సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో గురువారం చేరారు. వారికి కండువ కప్పి పార్టీలోకి అహ్వానించారు.

నివాళి

రఘునాథపల్లి: శివాజీనగర్ గ్రామానికి చెందిన హింగె రాధాబాయి (76) గురువారం అనారోగ్యంతో మరణించింది. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బీఆర్ఎస నాయకులతో కలిసి శివాజీనగర్ చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూల మాలలతో నివాళులర్పించారు.

అభినందనలు

పాలకుర్తి టౌన్: తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారానికి ఎంపికై న మండలంలోని తొర్రూరు గ్రామానికి చెందిన పగిడిపాల ఆంజనేయులును సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ గురువారం అభినందించారు. తెలుగు వారి మీద పరిశోధనాత్మక వ్యాసాలు, సామాజిక అంశాల మీద విశ్లేషణాత్మక వ్యాసాలు ఆంజనేయులు రాశారు. ఆయన ప్రస్తుతం పత్రికా రంగంగాలో కొనసాగుతున్నారు. సోమనాథ కళాపీఠం సభ్యుడు డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ, పులి గణేష్, బహుజన కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు గుమ్మడిరాజు సాంబయ్య అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన టాటా ఏస్ వాహనం

కొడకండ్ల: ట్రాక్టర్, టాటా ఏస్ వాహనం ఢీకొని ఐదుగురికి గాయాలైన ఘటన గురువారం రాత్రి మండల కేంద్ర శివారులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నీలిబండ తండాకు చెందిన గుగులోత్ దూల్‌సింగ్ టాటాఏస్ వాహనం నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. సూర్యాపేట జిల్లా తిర్మలగిరికి చెందిన కూరగాయలు అమ్ముకొనే చిరువ్యాపారులను నిత్యం సంతలకు కిరాయికి తన వాహనంలో తీసుకెళ్తుంటాడు. కొడకండ్లలో జరిగిన సంతకు నలుగురు చిరువ్యాపారులను తీసుకొని వచ్చి సంత ముగిశాక వారిని తిర్మలగిరికి తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో మండలకేంద్ర శివారులోని పెట్రోల్ పంప్ సమీపంలో ఎదురెదురుగా వస్తూ ట్రాక్టర్, టాటా ఏస్ వాహనాలు ఢీకొనడంతో డ్రైవర్ దూల్‌సింగ్ కాలు విరగగా, దొంతర బోయిన భారతమ్మ, కళమ్మ, రంగమ్మ, వెంకటమ్మకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను తిర్మలగిరి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కూపన్ ఉంటేనే ఇసుక

బచ్చన్నపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధిత అధికారుల ఇచ్చిన కూపన్ ఉంటేనే ఇసుక తరలించాలని తహసీల్దార్ రామానుజాచారి అన్నారు. గురువారం పోచన్నపేట జీపీ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, ఎస్సై ఎస్కే అబ్దుల్ హమీద్ గ్రామ ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పేర ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారనే సమాచారం మేరకు గ్రామానికి వచ్చామని తెలిపారు. ఇసుక కూపన్ ఉన్న వారికి మాత్రమే పోయాలన్నారు. ఎంఆర్ఐలు వంశీకృష్ణ, మునావర్, జీపీ కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

భగవద్గీతతో ధర్మమార్గం



శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

బచ్చన్నపేట: నేటి యువతరానికి భగవద్గీత ధర్మ మార్గములకు సూచనలు, సలహాలను అందిస్తుందని, ప్రతి ఒక్కరూ తప్పకుండా భగవద్గీతను చదవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక ఉత్సవ కమిటీ సభ్యులు కొన్నె ఉపేందర్, నాగలక్ష్మి చెప్పారు. గురువారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో శ్రీకృష్ణుని పల్లకి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో గ్రామంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. జనగామ, భువనగిరి, చేర్యాల కమిటీ సభ్యులు శ్రీనాథ్, దేవేంద్ర, పంచాక్షరి, రామారాజు, శివరామకృష్ణ, లక్ష్మీనారాయణ, శంకర్, యాదగిరి, అలత, మాధవి, శాంతి, సూరజ్, సుకన్య, లత, జయమ్మ, దనలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

మాస కల్యాణం



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా చండిక అమ్మవారి ఆలయంలో గురువారం చండీకాసమేత శ్రీసోమేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

26న హుండీ లెక్కింపు..

శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 26న హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.